


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 | మే, 2023 | సంచిక : 12



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ


**సాయివాణి చందా వివరాలు**

రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా....... రూ॥1000/-


**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565


**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** — **పుట సంఖ్య**


మా వాణి ........ 2
శాశ్వత ధర్మగోప్త ........ 7
సాయిభక్త దాసగణు ........ 10
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 13
భక్తి, ధర్మ ప్రచారం ........ 15
సంసారం, ఓ సంకెల ........ 17
మాతృసంస్థ కబుర్లు ........ 22
శ్రీ సాయినాథ అష్టోత్తర ........ 27
ఎవరికి ఉపదేశం చెయ్యాలి ...... 29
PRAYER AND ITS EFFICACY 31


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



## మసీదులో ముగ్గురు

శ్రీ సాయినాథుల వారు మసీదులో నివసించినంతకాలం - అరవై సంవత్సరాలపాటూ కూడా పాడుపడిపోయిన మసీదులోనే ఉన్నారు. ఆ మసీదుకు 'ద్వారకామాయి' అనే నామకరణం చేశారు. నిత్యమూ దీప మాలికలు వెలిగించారు. తులసి బృందావనం పెంచారు. గంటలు, చిరుతలు, మృదంగం ఆది వాద్యాలతో హారతులు పాడనిచ్చారు. అక్కడే వందలాదిమందికి వండి వడ్డించారు. భగవద్గీతకు వ్యాఖ్యానం చెప్పారు. ఖురాన్‌లోని కల్మాలు వల్లె వేయించారు. నింబారుకు పూలమాల వేశారు. నిత్యాగ్ని హోత్రం (ధుని) వెలిగించారు. హిందువుల పండుగలలో శ్రీరామ నవమి, గురు పూర్ణిమ వంటివి స్వయంగ ప్రోత్సహించి చేయించారు. ముస్లింల చేత చందనోత్సవం లాంటివి చేయించారు. అలా సర్వజనులనూ ఆదరిస్తూ, వారి వారి స్థాయికి తగిన బోధలు చేస్తూ ఆ మసీదులో పగలంతా గడిపారు బాబా. కట్టడా (చెక్క కట్టడం)పై చేయి వేసుకుని కాళ్లు చాపుకుని కూర్చొని మధ్య మధ్య ధునిలో మంట సరిచేస్తూ మన పాప ఫలితాలు కాలుస్తున్నట్లుగా మధ్య మధ్యలో అందులో కట్టెలు వేస్తూ, నిత్యం ఎవరినో ఒకరిని రక్షిస్తూ జీవించారు బాబా.

వారు పడుకోవటానికి ఒక చెక్క బల్ల సంపాదించారు. జానెడు వెడల్పు, ఆరడుగుల పొడవున్న ఆ చెక్కను మసీదు పైకప్పుకు వ్రేలాడదీసారు. తాళ్లతో కాదు సుమా- చిన్న చిన్న గుడ్డ పీలికలన్నీ కలిపి ముడులు వేసి, తాడులాగా తయారుచేసి వాటితో వ్రేలాడదీసారు. బాబాలాంటి భారీ మనిషి ఆ బల్ల మీద ఎలా పడుకోగలరు. ఏమో! పైగా దాని మీద నాలుగు మూలల

నాలుగు దీపాలు వెలిగించి ఉంచేవారు. అదీగాక, ఆ బల్ల చాలా ఎత్తుగా, పై కప్పుకు దగ్గరగా కట్టి ఉంచేవారు. అంత ఎత్తుకు ఎలా ఎక్కుతారు. ఎలా దిగుతారు? బాబా బరువుకు ఆ గుడ్డ పీలికలు తెగకుండా ఎలా ఉన్నాయి? అన్నీ సందేహాలే. ఆ సందేహ నివృత్తి కోసం జనం ఎగబడ సాగారు. దానితో బాబాగారు ఆ బల్లను కాస్తా విరిచి అవతల పడేసారు. ఇక అటుపైన బాబాను సొంత తోబుట్టువులా ఆదరించింది బైజాబాయి. ఆమె కొడుకు తాత్యా. చిన్ననాటి నుండి బాబాను 'మామా' అని పిలుస్తుండే వాడు. అతడు రాత్రివేళల్లో మసీదులో బాబా దగ్గరే పడుకునేవాడు. బాబాను తొలిసారిగా 'సాయి' అని పిలిచిన భక్తుడు మహల్సాపతి. ఇల్లూ-వాకిలీ విడిచి పగలే కాక రాత్రులు కూడా బాబాతోనే ఉండేవారు. ఈ ముగ్గురూ తలలు ఒక చోటకు చేర్చి పడుకునేవారు. ఎవరైనా నిద్రపోతున్నట్లు అనిపిస్తే తెల్లవార్లు కుదిపి లేపి కూర్చోబెట్టేవారు. మొత్తం మీద అర్ధరాత్రి వరకు ఏవేవో కబుర్లు చెప్పకునేవారు. ఒకరు స్వయం పరమాత్ములు, రెండువ వారు ప్రగాఢ భక్తులు. మూడవ వారు తన వయస్సును మించిపోయిన పరిపక్వత కలిగిన ధన్యుడు. ఈ ముగ్గురూ కలిసి ఏమి మాట్లాడుకొని ఉంటారు? అందులో ఏయే విషయాలు దొర్లి ఉంటాయి? బాబా గారి వాక్కులు మిగిలిన ఇద్దరి చర్చలూ, అమాయకమైన ప్రశ్నలు బాబా వారికి నవ్వే పుట్టించాయో, ముచ్చట కలిగించాయో! మొత్తం మీద వారు ఎన్ని వేదాంత చర్చలు చేశారు. ధార్మిక విషయాలు చర్చించారు. మనం వినక పోయినా, మహల్సాపతి సహించిన నిర్భర దారిద్ర్యాన్ని, తాత్యా జబ్బు పడి నప్పడు బాబా చూపిన అనంత ప్రేమను బట్టి చూస్తే వారి చర్చల సారాంశం మనం ఊహించుకోవచ్చు.

బాబా వారు నిర్నిద్రులు మహల్సాపతి చెయ్యి తన గుండె మీద ఉంచ మనేవారు. నిద్రాభారంతో ఆ చెయ్యి బరువెక్కగానే మహల్సాను మంద లించేవారు. మనం సామాన్యులు బాబా వలె నిర్నిద్రులుగా ఉండలేం.





అయితే పగలంతా పనిపాటలు చేసుకుంటూ నిత్యకృత్యాలతో పాల్గొంటూ, మిత్రులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ కూడా నిరంతరం నామ స్మరణ చేయవచ్చు. ఎడతెగని నూనె ధారలాగా, భగవంతుని స్మరించటమే భక్తి - అన్నారు పెద్దలు.

సాయి, మహల్సా, తాత్యాలు ఒక్కచోటే పడుకొనేవారు. ఒకరినొకరు హెచ్చరించుకునేవారు. ఒకరు నిద్రలో మునిగితే మరొకరు తలనొక్కి లేపేసే వారు. నవ్వుతూ నవ్వుతూనే మళ్లీ చర్చలోకి దింపేవారు. అలా అలా అర్ధరాత్రి దాటిపోయేది. మరి మనం మాత్రం అలా ఎందుకుండలేము? ఏవో వ్యర్థమైన పదములందు దోషముండక మానదు అన్నది బైబిల్ సూక్తి. మితభాషి కుండే మన్నన అతి భాషకి ఉండదు అని మన పెద్దలు చెప్తారు. మిత్రులు ఆప్తులతో మాత్రమే కాదు ఎవరితోనైనా సంభాషణ అంటూ మొద లయితే - అది ఒకే తీరున పోతుందని చెప్పలేము. సంసారాలు, సంసారాల కష్టసుఖాలు, పిల్లల వ్యవహారాలు, ఇరుగుపొరుగు ముచ్చట్లు, చచ్చిపోయిన అత్తగారు పెట్టిన కష్టాలు, రాజకీయాలు, ఇంకా యింకా యింకా ఏవేవో ఒక దాని వెనుక ఒకటిగా దొర్లిపోతూ ఉంటాయి. ఈ మాటల వలన ప్రయోజనం ఏమిటి అన్నది ఆలోచనల్లోంచి జారిపోయి, ఎక్కడెక్కడివో తవ్వుకొంటూ తలపోసుకుంటూ కాలక్షేపం చేస్తాం అలా కాకుండా కొందరు సాధనలో ముందుంటారు. కొందరు వెనుకపడవచ్చు. కొందరు బద్ధకస్తులుండవచ్చు. కొందరు లౌకిక మాయలలో పడుతూ అప్పడప్పడూ ఉలికిపడి లేస్తుండేవాళ్ళు కొందరు. అలా ఎన్నోరకాల తేడాలుంటాయి. ఒకే గురువు శిష్యులలో ఒకే సత్సంగ సభ్యులలో కూడా ఎంత అంతరాలున్నా గానీ వారంతా ఒక తల్లి కడుపున బుట్టిన ఏకోదరులతో సమానం. అందుచేత ఒకరినొకరు సరిచేసుకుంటూ, వారిని చూచి తమ లోపాలు దిద్దుకుంటూ, తమ స్థాయి దాటిపోతే-తమకంటే ముందున్న వారితో చర్చిస్తూ అలా క్రమంగా ఎదుగుతూ పోవాలి అంతేగానీ వాళ్ళేమను

కుంటారో అన్న మొహమాటంతో ఎవరే సొద వెళ్లబోసుకుంటుంటే అదంతా ఓపిగ్గా ఆలకిస్తూ పోతుంటే-మొదటిది ఆ సమయం అంతా దైవానికి దూరంగా ఉన్నట్లవుతుంది. రెండవది - మన సహ సాధకుల బలహీనతలను మరింతగా ప్రోత్సహించినట్లు అవుతుంది. కాలక్రమంలో ఆ మాయ మననూ ఆవరించి, మనం కూడా అదే పోకడలలో పడిపోయినా పోవచ్చు. అంచేత మిత్రులారా!

మన లోపల ఏదైనా దుఃఖం తొలుస్తున్నపుడు "వీళ్లందరికీ చెప్పకోవడం దేనికి? వీరంతా నా కష్టాలు తీర్చగలరా? నా పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోగలరా? పైగా ఏదో తేలికదనం తప్ప లాభం ఏముంది? అసలైన వాడికే చెప్పకుందాం. తన మీదకి ఎవరైనా రాయి విసిరితే రాతిని చూసి కాక, రాయి విసిరిన వాడిని చూచి కుక్క మొరిగినట్లుగా, నేను కూడా నా కష్టాన్ని చూచి దుఃఖపడక, ఇచ్చిన భగవంతుడికే మళ్ళీ మళ్ళీ మొరపెట్టుకుంటే పోలేదా? ఆ స్వామినే స్మరిస్తుంటే ఈ కష్టం కొంతైనా కరగదా? అనుకోగలగాలి. ఎదుటి వారు పదేపదే ఏవైనా స్వవిష యాలు, పోనీ లౌకిక విషయాలు మాట్లాడుతుంటే మనం కాస్త జాగ్రత్తగా ఆ సంభాషణ మార్గం మళ్ళించి దైవ విషయాల పైకి తేగలగాలి. భగవంతుడు మనకిచ్చిన జీవనకాలంలో ఎంతో సమయం ఇప్పటికే వ్యర్థమైపోయింది. ఇక మిగిలిన కాలాన్నైనా ఫలవంతంగా తీర్చిదిద్దుకుందాం. ఎంతో అవసరమైనప్పడు తప్ప సంభాషణలు పెంచకుండా జాగ్రత్త పడదాం. ఎక్కడికైనా నడిచివెళ్లటం, అలవాటుగా చేసే వంటపనులు, తలలు దువ్వటాలు, బియ్యం ఏరటం, కూరగాయలు కోయటం వంటి పనులు చేసేటప్పడు అలా ఏవైనా యాంత్రికంగా పనులు జరిగిపోయే సమయాల్లో మనసులో నామజపం జరుగుతూ ఉండవచ్చు. వంటలాంటి పనుల్లో నలుగురైదుగురు కూర్చునప్పడు చర్చో, సంకీర్తనమో జరుపు





కోవచ్చు. అందరూ ఒకే భావనతో చేసినప్పడు ఏదైనా ఎక్కువ ఫలవంతమవుతుంది కదా!

సహసాధకులైనా వారు ఒకరు చెప్పిన దానినొకరు సహృదయంతో అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. అలాగే చెప్పేవారు కూడ దోష, దర్శన దృష్టితో కాక-ప్రేమ భావంతో, నిర్మల చిత్తంతో చెప్పాలి. అలా అయితే పని సఫలమవుతుంది. ఇది వ్రాస్తోంటే నాకు మా గల్లీగాడు గుర్తు వస్తున్నాడు. మాత్ర మందిరంలో ఉదయం ఆరయ్యేటప్పటికి ఆబాలగోపాలం చేరిపోయేవాళ్లం, ప్రాతః ప్రార్థనకు గురువుగారు కూడా వచ్చేవారు. (అప్పటికింకా గుడి కట్టలేదు); అందరిలో చిన్నవాడు మా గల్లీగాడు. (స్వర్గీయ సాయిదీప్). సాయి సంకీర్తనతోపాటు భజగోవింద స్తోత్రం చదివేవాళ్లం ప్రతిరోజూ అప్పట్లో. మా ఆరేళ్ల గల్లీగాడు మహామేధావి. వాడు శ్లోకం అంతా తలవంచుకు చదివేవాడు. చివరిలో 'గోవిందం భజమూఢమతే' అనేటప్పడు మాత్రం మెల్లగా, కొంటెగా ప్రక్కవాళ్ల ముఖంలోకి చూచేవాడు. మనం అలాంటి కొంటెతనం చూపించకుండా, ప్రేమతో, స్నేహంతో, మనను మనం దిద్దుకొంటున్నంత సహజభావంతో ఏదైనా చెప్పాలి. మన మిత్రులకు కాదూ-ఎదుటివాళ్లలోనే ఔన్నత్యం కనపడుతుందనుకొందాం ఒక్కొక్కసారి. అప్పడు తలవంచి ఆ గొప్ప లక్షణాన్ని మన సొంతం చేసుకోవడానికి కూడా సంసిద్ధులం కావాలి. అక్కడ భేషజం చూపిస్తే మన ఎదుగుదల ఆగిపోతుంది.

మొత్తం మీద మసీదులోని ముగ్గురిలో (బాబా వారితో) మహల్సా, తాత్యాలకు బాబా దగ్గర దొరికిన స్థాయికి, చరిత్రలో వారికి మంచి భక్తులుగా దొరికిన చరితార్థతకు కారణం. బాబాతో వారు జరిపిన నిత్య సత్సంగమే నిరంతర మననము. అది గుర్తుంచుకొని మనం కూడా బాబా వారి నిత్యస్మృతితో జన్మలు పునీతం చేసుకుందాం.

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

'మన సుభద్ర భవనం ప్రక్కనున్న పూదోటలో విశ్రాంతి కుటీరం ఉన్నది గదా! దానిలో వసతి కల్పిస్తే ఎలా ఉంటుంది? సుభద్ర వారికి పరిచర్య చేస్తూండవచ్చు. మహాత్ముల ఆశీస్సులు సులభంగా లభించవు గదా!'

శ్రీకృష్ణుడు నెమ్మదిగా బలరాముణ్ణి ప్రక్కకు పిలిచాడు.

'అన్నా! త్వరపడకండి. ఆ తాపసి పడుచువాడు. అందగాడు-మాటలో తీపిదనం ఉన్నవాడు. సుభద్ర ఈడు వచ్చిన పిల్ల. సౌందర్యరాశి. సుభద్ర తోటలో ఏర్పాటు, సుభద్రను పరిచర్యకు ప్రోత్సహించడం మంచిదేనా? మీరాలోచించండి. నాకైతే నచ్చడం లేదు. అయినా మీరు పెద్దవారు. మీరు ఏది సముచితంగా ఉంటుందంటే అలా చేద్దాం. నా భయమల్లా ఒక్కటే. ఇరువురు పరస్పరం ఆకర్షణకు లోనవుతారేమోనని'.

'కృష్ణా! నీకు అనుమానాలు మెండయ్యా! ఆయన గొప్పదనాన్ని నీవు గుర్తించడం లేదు. ప్రపంచమంతా తిరిగి వచ్చినవాడు. ఎందరెందరిని అనుగ్రహించాడో, ఎంత తేజం ఉన్నదా ముఖంలో! అలాంటివాడు చంచలుడవుతాడా? ఆయన పట్ల అలాంటి ఊహ కలుగడమే పాపం' అని బలరాముడన్నాడు.

'ముందు జాగ్రత్త అవసరం. కనుక చెప్పతున్నాను. అతనెవరో ఎక్కడి వాడోనని'

'కృష్ణా! మహాత్ముల పట్ల నిరాదరణ పనికిరాదయ్యా'

'సరే! మీ ఇష్టం' అన్నాడు కృష్ణుడు.





బలరాముని ఆదేశానుసారం ఆ తాపసిని-కృష్ణుడే సుభద్ర నివాసానికి ఆనుకుని ఉన్న పూదోటలోని విశ్రాంతి కుటీరానికి తీసుకుని వెళ్ళాడు. ఆయనకు కావలసిన అవసరాలకు ఏర్పాట్లు చేయించాడు. బలరాముడు చెప్పిన మాటలను సుభద్రకు చెప్పి ఆ తాపసికి జాగ్రత్తగా సేవ చేస్తుండమని చెప్పాడు. సుభద్ర అంతవరకు అర్జునుణ్ణి గురించి వినడమే కాని చూడలేదు. ఆ తాపసి ఎవరో మహాత్ముడనే ఆమె ఊహ. కృష్ణుడు, రుక్మిణీ-సత్యభామలకు ఆ తాపసి అసలెవరో రహస్యంగా చెప్పాడు. వాళ్లిద్దరూ కూడా అంతవరకు అర్జునుణ్ణి చూడలేదు. వారూ అతణ్ణి చూచి ఆనందించారు. సుభద్ర అదృష్టాన్ని లోలోన అభినందించారు.

ఆ పూతోటలో అందమైన పరిసరాలలో సుభద్ర సేవలందుతూ అర్జునుడు అలా కాలాన్ని ఊర్పులతో, నిట్టూర్పులతో గడుపుతున్నాడు. అతని చూపులన్నీ సుభద్ర మీదే. ఆమె ఎటు నడిచినా అతని చూపులు అటు పరుగెత్తుతుండేవి. సుభద్ర అతణ్ణి గమనిస్తుండేది. అతడు తాపసి, కాని భుజాలలో ఒరిపిడి మరకలున్నాయి. అవి కేవలం ధనుర్ధారులకే ఏర్పడతాయి. రెండు భుజాలకు ఆ మరకలున్నాయంటే రెండుచేతులా అవలీలగా ధనువునుపయోగించే ఏకైక ధానుష్కు డర్జునుడు. సుభద్ర కూడా శస్త్రాస్త్రాలను సాధన చేసిన వీర యువతి. రథాన్ని నడపడంలో ఆమె ప్రత్యేకమైన నేర్పును సాధించింది. కృష్ణుని ముద్దుల చెల్లెకావడాన చనువెక్కువ. ఎప్పుడూ అతనివెంట ఉండేది. అలా మనుష్యులను పరిశీలించే అభ్యాసం ఏర్పడింది. సుభద్రకు ఆ తాపసిని చూస్తుంటే, అతని హావభావాలు, కదలికలు, అందమైన అతని ముఖకవళికలు, ఆ నడక, ఠీవి, అతని మాటల మాధుర్యం, ఆ చూపులు-ఆలోచిస్తే తన తమ్ములు గదుడు, సారణుడు అర్జునుని వర్ణించిన వర్ణనలతో సరిపోతున్నది. ఇతడే అర్జునుడు కాదు కదా!

కృష్ణుడు ఇంద్రప్రస్థానికి పంపిన చారుడు ఆశ్చర్యకరమైన వార్తలు

తెచ్చాడు. ఇంద్రప్రస్థంలో అందరూ క్షేమంగానే ఉన్నారు. కాని శకుని నీలినీడలు ఇంద్రప్రస్థాన్ని ఆవరించి ఉన్నాయి. హస్తిన నుండి పాండవులు ఖాండవ ప్రస్థానానికి బయలుదేరినప్పుడే శకుని తన విశ్వాసపాత్రులైన చారులను కూడా ఖాండవ ప్రస్థంలో స్థిరపడి, అక్కడ తన మంత్రాంగాన్ని నడిపేటట్లు ఏర్పాటు చేశాడు.

ద్వారకలో జరిగిన శ్యమంతక సమాచారం ఇంద్రప్రస్థానానికి చేరిన వెంటనే ధర్మరాజు భీముణ్ణి, నకులుణ్ణి ద్వారకకు పంపడానికి ఏర్పాటు చేశాడు. అర్జునుడు తీర్థయాత్రలో ఉన్నాడు. భీముడు, నకులుడు, ఇంద్ర ప్రస్థం నుండి ద్వారకకు బయలుదేరుతూన్న వేళకు కొందరు తాపసులు ఇంద్రప్రస్థానికి వచ్చి ధౌమ్యుల వారి నివాసానికి వెళ్లారు.

'మీరు ఎక్కడి నుండి విచ్చేస్తున్నారు?' అని ధౌమ్యుల వారు వారి నడిగారు. 'మహర్షీ! ప్రభావం నుండి, ద్వారకకు వచ్చి, అక్కడి నుండి నేరుగా ఇక్కడికే వస్తున్నా'మన్నారు ఆ తాపసులు.

'ద్వారక నుండా! శ్రీకృష్ణులవారు క్షేమమేనా? ఆయన మీద సత్రాజిత్తు ఏదో విచిత్రమైన దొంగతనం నింద మోపారట. శ్రీకృష్ణుల వారు ఆ నింద నివారించుకోందే ఇక ద్వారకలో అడుగుపెట్టనని వెళ్లిపోయినారట!' అని ధౌమ్యులవారు ఉద్వేగంతో ప్రశ్నించారు.


ఆ తాపస బృందం విభ్రాంతిని ప్రకటించింది. 'మహర్షీ! మీరంటున్నది మాకర్థం కావడం లేదు. మేము స్వయాన శ్రీకృష్ణుల వారిని ఆశీర్వదించి వస్తున్నాము. దేవకీ వసుదేవులను, ఉగ్రసేన మహారాజును, బలరాముల వారిని కలిసాము. వారు మమ్మల్ని ఆదరించి సన్మానించారు. మీరు చెప్పతూన్న సంగతి ద్వారకలో ఎవరూ అనుకోవడం వినలేదు. శ్రీకృష్ణ బలరాములు రాచకార్యంలో తలమునకలవుతున్నారు'.

'మీరు నిజం చెబుతున్నారా! మాకు అందిన వార్త చాలా ఆందోళన కల్గించే విధంగా ఉన్నది.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

నా గురించి ఇలా కలవరపడేవాళ్లు ఇంకెవరున్నారు అని అంటూ ఎక్కిళ్ళు, ఎక్కిళ్ళు పెట్టి రోదించసాగాడు. బాబా తనను ప్రేమగా నిమిరి **"వెళ్ళు, వెళ్ళి భోంచేయ్, నాకు చాలా ఆకలిగా ఉంది"** అని అన్నారు. "తాను భోజనం చేయలేదని, బాబా కూడా భోజనం చేయలేదు" అనే విషయం తెలియగానే పురంధరే ఖిన్నుడయ్యాడు. బాబా మాతృ వాత్సల్యానికి తీవ్రంగా చలించిపోయాడు. బాబా పాదాలను గట్టిగా పట్టుకొని పెద్దపెట్టున రోదించసాగాడు. ఆ దృశ్యం చూస్తున్న వారి కనుల నుండి అశ్రుధార ప్రవహించసాగింది. అన్నపానీయాల గురించి ఆలోచించకుండా, తన గురువు కోసం తాను చేసుకోవాలనుకున్న సేవలో తనను తాను మరచిన భక్తుడు, తాము కూడా భోజనం చేయాలనే విషయాన్ని మరచి అయ్యో, బిడ్డ అన్నం తినకుండా ఆకలితో కష్టపడుతున్నాడని కన్నతల్లి వలె తీవ్ర మనోవేదనకు గురవుతున్న సద్గురువు ... వారిరువురి పరస్పర ప్రేమను చూసిన భక్తులు తీవ్ర ప్రేమోద్వేగానికి లోనై, కళ్ల నుండి అశ్రుధార ప్రవహిస్తుండగా మైమరచిపోయి మనః చక్షువులతో ఆ దృశ్యకావ్యాన్ని వీక్షించడంలో లీనమయ్యారు.

కొంచెంసేపటికి పురంధరే తేరుకొని, తాను భోజనం చేస్తేగాని బాబా భోజనం చేయరనే ఉద్దేశ్యంతో "బాబా, మరి నేను భోజనానికి వెళ్లాక, మీరు ఇదంతా పడగొట్టారంటే, నేను పడిన కష్టమంతా వృథా అవుతుంది" అని అన్నాడు, అప్పడు బాబా అక్కడే ఉన్న కాకాసాహెబ్ దీక్షిత్ వైపు తిరిగి **"నేనేమైనా రాక్షసుడినా ఏమిటి? కాకా, మన పిల్లలు ఒడిలో మలవిసర్జన చేస్తే,**

**మనమేమయినా మన ఒడిని కానీ, పిల్లవానిని కానీ తెగ నరుక్కుంటామా?"** అని అంటూ, పురంధరే వైపు తిరిగి, తనతో **"వెళ్ళు, వెళ్ళి భోజనం చేసిరా! తరువాత పని పూర్తిచేయి. నేనేమి పడగొట్టను వెళ్ళు"** అని అన్నారు. అప్పుడు పురంధరే బాబా పాదాలకు నమస్కరించి, బాబా చేతి గుండా ఊదీ తీసుకొని, భోజనానికి వెళ్ళాడు. అప్పుడు బాబా, కాకాసాహెబ్ దీక్షిత్‌తో "కాకా, ఎవరు ఏ భావంతో కర్మ చేస్తే, వారికి అదే విధంగా ఫలప్రాప్తి ఉంటుంది. ఇదంతా అల్లామియా యొక్క కేళి" అని వ్యాఖ్యానించారు.

ఈ లీలను అత్యంత సావధానంగా పరికిస్తే సాయి యోగం, సాయి మార్గం గురించిన అద్భుతమైన సత్యాలు అవగతమవుతాయి. నిజానికి భగవంతుడు స్వీకరించేది బాహ్యమైన, పరిమాణాత్మకమైన వ్యక్తీకరణను గాక, ఆ వ్యక్తీకరణ వెనుకనున్న భావాన్నే అని మరలా మనకు ఇక్కడ రూఢీ అవుతుంది. **"ఎవరు ఏ భావంతో కర్మ చేస్తే, వారికి అదే విధంగా ఫలప్రాప్తి ఉంటుంది"** అనే బాబా మాటలు పై సత్యాన్నే పలుకుతున్నాయి. భగవంతుడు ప్రాముఖ్యం ఇచ్చేది భక్తి భావానికేగానీ, స్థూలమైన కర్మకు కాదు అని బాబా తేల్చి చెప్పారు. భగవంతుడు భక్తుని నుండి ఎటువంటి భక్తిని ఆశిస్తారో విశదీకరించారు. భక్తి భావ వ్యక్తీకరణలో దాగియున్న ప్రేమనే సద్గురువు స్వీకరిస్తాడు. ఆ ప్రేమ ఎంత ఎక్కువగా ఉంటే వారికి ఫలితం కూడా అంతే ఎక్కువ ఉంటుందనే అపురూపమైన ఆధ్యాత్మిక సత్యాన్ని భక్త జనులకు బోధించారు. **"నాకు పల్లకీ అవసరం లేదు"** అని బాబా కరాఖండిగా చెప్పారు. చేతల ద్వారా వ్యక్తీకరించారు. పురంధరేను వారించారు. కానీ, పురంధరే వినలేదు. ఆ సమయంలో ఆ పల్లకీని బాబా కోసం ఏర్పాటు చేయడమే తనకు తెలిసిన, తాను నమ్మిన భక్తి భావ వ్యక్తీకరణ! అందుకోసం ఆకలిదప్పలను పట్టించుకోకుండా కష్టపడ్డాడు. బాబా స్వీకరించింది ఆ భావాన్ని మాత్రమే! ఆకలి కడుపుతో కష్టపడుతున్న





పురంధరే భక్తి భావానికి కరిగిపోయి కన్నతల్లి వలె పురంధరేపై అవ్యాజమైన ప్రేమను కురిపించారు. నిర్మలమైన భక్తి భావానికి బాబా సంతుష్టుడు అవుతాడు కానీ, బాహ్యంగా కనిపించే స్థూలమైన కర్మకు, వస్తువులకు కాదు అనే సత్యాన్ని నొక్కి వక్కాణిస్తున్నట్లుగా బాబా తమ భౌతిక జీవన కాలంలో ఎన్నడూ ఆ పల్లకీలో ఎక్కలేదు. భక్తులు సమర్పించే బాహ్య ఆడంబర సామాగ్రిని ఎన్నడూ సొంతం చేసుకొనలేదు. ఇక్కడ గమనించాల్సిన అద్భుతమైన విషయం ఏమిటంటే, పురంధరే ఆకలి కడుపుతో కష్టపడుతున్నాడని తాము కూడా భోజనం చేయకుండా తల్లడిల్లిన వైనంలో, సద్గురువులోని మాతృ వాత్సల్య కోణాన్ని ఆవిష్కరించారు. భక్తులు ఆకలి కడుపుతో కష్టపడుతుంటే కనలేని తమ కన్నతల్లి మనసును తెలియజేసారు. తమ భక్తులను కన్నతల్లి వలే ప్రేమించి, లాలించి కరుణ కురిపించే సాయి వంటి భక్త సులభుడైన సమర్థ సద్గురువు చరణాల వద్ద ఆశ్రయం పొందిన భక్తుల భాగ్యాన్ని ఏ విధంగా వర్ణించాలి.

శ్రీమతి తర్కడ్ బాబాకు వంకాయ వేపుడు, వంకాయ పెరుగు పచ్చడి చేసి, పెట్టమని షిరిడీకి వెళుతున్న శ్రీమతి పురంధరేకి ఇస్తే, షిరిడీ వచ్చిన తరువాత శ్రీమతి పురంధరే వంకాయ పెరుగు పచ్చడిని మాత్రమే చేసి బాబాకు నైవేద్యంగా సమర్పించింది. కుక్కలు, పిల్లులు సంతుష్టిగా భోజనం చేసిన తరువాత మిగిలిపోయిన తమ భిక్షాన్న భోజనాన్ని భుజిస్తారే తప్ప సాధారణంగా బాబా భక్తులు తెచ్చే నైవేద్యాన్ని భక్తులకే పంచిపెడతారు. కానీ, ఆ రోజు ఆకలిగొన్నవాడై వంకాయ పచ్చడిని ఎంతో ప్రీతిగా భుజించి, వంకాయ వేపుడు కూడా కావాలని పట్టుబట్టారు. నిజానికి కొంచెం తరచి చూస్తే బాబా పట్టుబట్టింది వంకాయ వేపుడు కోసం కాదు, ఆ రెండు రకాల వంటకాలతో బాబా భుజించాలన్న శ్రీమతి తర్కడ్ భక్తి భావాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించి ఆమెను సంతుష్టురాలిని చేయడానికేనని మనకు అవగతమవుతుంది.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము
## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

(గత సంచిక తరువాయి)

## 19. సాయి మాటయె మందగు

ఆ.వె. సాయి మాటలెపుడు సంక్షిప్తమైయుండు
గోచరించు నందు గూఢతయును
అర్థవంతమగుచు నవి విద్యగఱపుచు
తూకసమముగల్గి తోచుచుండు. 1

ఆ.వె. చింతలేని బ్రతుకు చిన్మయరూపంబు
భయములేని బాట బాబ పథము
తను ఫకీరు లేవు తన కిల్లు-యిల్లాలు
మాయశరము విడదు మర్మమేమొ. 2

తే.గీ. మాయ మరిపించు నిజరూపు మాయజేయు
జనన చక్రాల త్రిప్పుచు చంపుచుండు
మాయ తప్పించుకొనుటకు మార్గమొకటె
సాయి పాదాలు పట్టుక సాగు పథము 3

ఆ.వె. పాపము క్షయించ వత్తురు నావైపు
సాయిబాట బట్టి సాగు కొఱకు
బాబ జపము జేయ బాయును బంధాలు
భక్తినావ యొకటె భవముదాట. 4

ఆ.వె. కాళ్ళ-వేళ్ళ బడగ కరుణించె సాయీశు
పూర్వజన్మకృతుని పుణ్యహీను





భీమపాటిలు నపుడు భీతుడు, క్షయరోగి
బాబ పాద మహిమ బాగుపడెను. 5

తే.గీ. శరణుగోరిన భీమాకు శాంతిజేసె
బెత్తెమున బాది, బాధించి పెద్దబండ
గుండెపై ద్రిప్పె కలలందు కుడువ పీడ
సాయినిధాన విధమిది స్వప్నమందు. 6

ఆ.వె. క్షయ రోగపీడ శాంతించ పాటిలు
సాయి వ్రతము నింట జరిపె నతడు
భక్తి, నిష్ట, మనన బాబాను పూజించ
పొందలేనిదేది? బొంది తోడ. 7

కం. బాలాగణపతి దర్జీ
చాలా జ్వరముకు భయపడి సాయిని జేరెన్
యేలా రోగము నయమయె!
'కాలా' కుక్కకు పెరుగును కుడిపినయన్నం. 8

కం. బాపూసాహెబ్ బూటీ
దాపుకు జేరగనె సాయి తగ్గించెనుగా
'ఆపుమికాంమ్లపు మంటలు'
ఆపుమనగ నాగె నతని యామ్లపు బాధల్ 9

తే.గీ. తీపి పాలలో మరగించి దప్పిదీర
పిస్త, ఆక్రోటు, బాదాము 'హైజ'ను దిన
మనెను సాయి-తినగ నా మందు, రోగ
ముపశమించెను-సాయికి మోకరిల్లె 10

తే.గీ. సామి యొకడొచ్చె చెవిపోటు సాయి దరికి
బాధపడలేక కింకర్తవ్య విముఖుండు,
'బాగుచేయునల్లా'యని పనిచెనతని
సాయి మాటయే మందయ్యె-సరిగనయ్యె 11

(సశేషం)

# భక్తి, ధర్మ ప్రచారం

**- సంత్ రవిదాసు**

సంత్ రవిదాసు వారణాసిలో ఒక చర్మకారుల (చెప్పలు కుట్టుకునే వారి) కుటుంబంలో జన్మించాడు. అయితే అతనికి చిన్నప్పటి నుంచి ఒక పురోహిత మిత్రుడుండేవాడు.

ఒకసారి 'గంగా దసరా' అనే ఒక పండుగ వచ్చింది. ఆనాడు అందరూ గంగాస్నానం చేసి గంగలో తాంబూలం వదులుతారు. ఆ రోజు పురోహిత మిత్రుడు వెళ్తూ రవిదాసుని కూడా తనతో రమ్మన్నాడు. తనకు చాలా పని ఉందని, రాలేనని, తన తాంబూలం కూడా అతడినే వదలమని చెప్పి తాంబూలం మిత్రుడికి ఇస్తాడు రవిదాసు.

పురోహిత మిత్రుడు స్నానం చేసి, తన తాంబూలాన్ని గంగలో వదలి, రవిదాసు తాంబూలాన్ని కూడా వదుల్తాడు. వెంటనే ఆశ్చర్యంగా ప్రవాహం నుంచి రెండు చేతులు వచ్చి ఆ తాంబూలాన్ని స్వీకరించి బదులుగా ఒక వజ్రవైఢూర్యాలతో నిండిన కంకణాన్ని ఇచ్చి, దానిని రవిదాసుకు ఇమ్మని చెప్పి అదృశ్యమైపోయాయి!

అంత విలువైన వస్తువును చూడగానే పురోహితుని మనస్సు దారి తప్పింది. దానిని రవిదాసుకు ఇవ్వకుండా తన ఇంటికి వెళ్ళిపోతాడు. వెళ్ళి కంకణాన్ని భార్యకు చూపుతాడు. ఆమె కూడా ఆశ్చర్యపోయి 'ఇది చాలా విలువైనది. రాజుకు చూపిద్దాం. ఇది తీసుకొని దీనికి తగ్గ ధనాన్ని ఇస్తే మన పేదరికం పోతుంది' అంటుంది. ఆ ప్రకారం అతడు రాజు వద్దకు వెళితే అతడు దానికి బదులుగా వెయ్యి బంగారు నాణెలను ఇస్తాడు. అవి తీసుకుని ఇంటికి వచ్చేస్తారు.

రాజు ఆ కంకణాన్ని రాణికి చూపిస్తాడు. దాని సౌందర్యానికి ఆమె





ఆశ్చర్యపోయి నాకిలాంటిదే ఇంకొకటి కావాలి. వారంలోగా రాకపోతే నేను ఉరేసుకుంటానని బెదిరిస్తుంది. రాజు చేసేదిలేక వెంటనే పురోహితుడిని పిలుస్తాడు. నా భార్య వారంలోగా ఇలాంటిదే ఇంకొకటి కావాలని అడిగింది 'నువ్వు ఆరు రోజులలోగా తేకపోతే మృత్యుదండన విధిస్తాను' అని హెచ్చరించాడు. వెంటనే పురోహితుడు భార్యతో చెపుతాడు. గతిలేని పరిస్థితిలో ఇద్దరు రవిదాసు దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి తమకు వచ్చిన ఆపదను వివరించారు. అతడి కాళ్ళు పట్టుకొని ఎలాగైనా ఇలాంటి కంకణాన్ని మరొకటి సంపాదించమని లేదా తన ప్రాణాలు తనకి దక్కవని వేడుకున్నాడు పురోహితుడు.

అప్పుడు రవిదాసు చెప్పలు కుట్టే సమయంలో చర్మాన్ని తడిపే పాత్రలో ఒక గ్లాసు నీళ్ళు పోసి గంగమ్మని ప్రార్థించి దానిలో తాంబూలం వేసాడు. దాన్లో నుంచి ఒక చేయి వచ్చి అలాంటి కంకణమే మరొకటి ఇచ్చి అదృశ్యమైంది. అది తీసుకుని పురోహితుడు రాజు దగ్గరకి వెళ్ళాడు. రాజుకిది ఆశ్చర్యంగా అనిపించి ఇవెక్కడి నుంచి వస్తున్నాయని అడిగాడు. అప్పుడు పురోహితుడు రవిదాసు గురించి, అతడి ఆధ్యాత్మిక శక్తి గురించి చెపుతాడు. అప్పుడు రాజు పరివారంతో సహా రవిదాసు గుడిసెకు వస్తాడు. అతడి భక్తి గురించి విని అతడిని చెప్పలు కుట్టే పని నుంచి తప్పించి, భక్తి, ధర్మ ప్రచారం చేయమని సమాజంలోకి పంపించాడు. అప్పటి నుంచి ఉత్తర భారతదేశం అంతా రవిదాసు ధార్మికతత్వంలో మునిగింది. అతడు ఋషిగా మారి మానవులకు మార్గదర్శనం చేస్తూ తన జీవితాన్ని గడిపాడు.

మహాపురుషులు ఏ కులంలోనైనా, ఏ రూపంలోనైనా జన్మిస్తారు. దైవానికి అంతరాలు లేవు. అందరినీ ప్రేమతో, గౌరవంతో చూసి - అందరిలో భగవంతుని దర్శించడం నేర్చుకోవాలి. భగవంతునికి అందరూ సమానమే.

# సంసారం ఓ సంకెల!

ఓ సాధుపుంగవుడు తన శిష్యుడికి భాగవత ప్రవచనం చేస్తూ, 'నాయనా! సంసారం అనేది మిథ్య; ఇందులో నీవనుకున్నట్లు శాశ్వత సుఖమేదీ లేదు! నాతోపాటు వచ్చేయ్' అన్నాడు. వెంటనే ఆ శిష్యుడు 'లేదు గురువుగారూ! నన్నెంతగానో ప్రేమించే భార్య, ముగ్గురు పిల్లలు, తల్లి దండ్రులు ఉన్నారు. వారికి నేనంటే ప్రాణం. వాళ్లను వదలి నేనెలా రాగలను?' అని బదులిచ్చాడు. అందుకు ఆ గురువు, 'నువ్వు నా వాళ్లు, నా వాళ్లు అంటున్నావు. పైగా వారు నిన్ను ప్రేమిస్తున్నారంటున్నావు. కానీ ఇదంతా నీ భ్రమే. నేనొక నాటకం ఆడతాను. దాని ద్వారా వారు నిజంగానే నిన్ను ప్రేమిస్తున్నారా? లేదా? అనే విషయం నీకర్థమవుతుంది' అంటూ ఓ గుళిక ఇచ్చాడు. 'ఇంటికి వెళ్లాక దీన్ని మింగు, దీని ప్రభావంతో నువ్వు అచేతనంగా, శవంలా పడిపోతావు. అయితే నీకు స్పృహ తప్పదు. చుట్టూ జరిగేదంతా వినగలవు. నేను వచ్చాక మళ్లీ నా మంత్రజపంతో నిన్ను సాధారణ స్థితికి తెస్తాను' అన్నాడు.

ఇంటికి వెళ్లి, గురువుగారు చెప్పినట్లే ఆ శిష్యుడు చేశాడు. శవంలా పడిపోయాడు. ఇంట్లో ఒక్కసారిగా శోకాలు మిన్నంటాయి. భార్య, బిడ్డలు విపరీతంగా విలపిస్తున్నారు. ఆ శిష్యుడు మనస్సులో తనపై వారికున్న ప్రేమను తలచుకొని ఎంతో పొంగిపోతున్నాడు; గురువుగారి మాటలు తప్పవుతాయని అనుకున్నాడు. ఇంతలో గురువుగారు వచ్చి, శిష్యుడు నాడి పరీక్షించి 'అరే! ఇదేంటి? ఇతడు చనిపోలేదు! నేనొక ఔషధం ఇస్తాను. అది పుచ్చుకోగానే మామూలు మనిషైపోతాడు' అన్నాడు. ఇంట్లోని వారందరి ఆనందానికి హద్దు లేకుండా పోయింది. 'కానీ, ఈ ఔషధాన్ని





ఆయనకు ప్రయోగించే ముందు, మరో వ్యక్తి దీనిని సేవించాలి. అయితే ముందుగా మందు సేవించిన వ్యక్తి మరణిస్తాడు' అని చెప్పాడు. 'మీరంతా ఇతనికి కావలసినవారే కదా! మీలో ఎవరో ఒకరు ఈ ఔషధాన్ని సేవించండి' అన్నాడు.

ఆ మాట వినగానే వారందరూ ఏడుపు మాని, ఒకరి ముఖాలు మరొకరు చూసుకోసాగారు. 'నేను పోతే ఇంత పెద్ద సంసారాన్ని ఎవరు చూసుకుంటారు? పోయినవాడు ఎలాగూ పోయాడు. మిగిలిన పిల్లల్ని, కోడల్ని, మనవల్ని చూసుకొని బతుకుతాను' అన్నాడు తండ్రి. 'అందరూ ఎప్పుడో ఒకప్పుడు పోయేవాళ్లే కదా! ఆయన తలరాత అలా ఉంది. పిల్లలకు తండ్రి లేకపోయినా ఫరవాలేదు. తల్లి లేకపోతే ఎలా?' అని పక్కకు వెళ్లింది భార్య. 'అమ్మలో నాన్నను చూసుకుంటాం. మేము జీవితాన్నేమీ అనుభవించ లేదు. మేమెందుకు త్యాగం చేస్తాం' అంటూ పిల్లలు లోనికి వెళ్లిపోయారు.

అప్పుడు శిష్యుడికి జ్ఞానోదయమైంది. తనకూ, వారికీ మధ్య ఉన్న అనుబంధం ఎంత గాఢమైందో అర్థమైంది. ఈ కఠిన సత్యాన్ని విశ్లేషిస్తూ ఆదిశంకరాచార్యులు 'భజ గోవింద స్తోత్రం'లో ఇలా అంటారు :

**కా తే కాన్తా కస్తే పుత్ర స్సంసారోऽయ మతీవ విచిత్రః।**

**కస్య త్వం కః కుత ఆయాతః తత్త్వం చిన్తయ తదిహ భ్రాతః॥**

'ఓ సోదరా! ఎవరు నీ భార్య? ఎవరు నీ పుత్రుడు; వారికీ, నీకూ ఉన్న సంబంధం ఏమిటి? నీవెవరు? ఎక్కడ నుంచి వచ్చావు? ఈ సంసారమే అతి విచిత్రమైంది. ఈ తత్త్వాన్ని తెలుసుకొమ్మ'ని హెచ్చరిస్తారు. సంసారంలో నుంచి కాకుండా, సంసారమనే మాయలో నుంచి బయట పడమంటారు. జీవనయానంలో భార్యాబిడ్డలు, బంధుమిత్రులు సహ ప్రయాణీకులే కానీ, శాశ్వత సంబంధీకులు కాదని గుర్తుచేస్తారు. కానీ, లౌకిక ప్రపంచంలో మనం అమాయకత్వంలో, అజ్ఞానంతో అనుబంధాల

విషయంలో అమితమైన అనురాగాన్ని పెంచేసుకుంటాం. చివరకు అనంత దుఃఖాల పాలవుతాం.

**విచిత్ర 'వల'యం :** ఆలోచిస్తే అన్నీ తెలిసినా మనుష్యులు ఈ సంసార వలయం నుంచి బయటపడే ప్రయత్నం చేయడం లేదు. లేనిపోని జంజాటంతో బతికినన్నాళ్ళూ ఆ కూపంలోనే కూరుకుపోతున్నారు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస అంటారు-"బయటపడటానికి మార్గం ఉన్నా వలలో చిక్కుకున్న చేప తప్పించుకోవడానికి ప్రయత్నించదు. తాను కట్టుకున్న గూట్లో తానే చిక్కుకొని చచ్చిపోతుంది పట్టుపురుగు. ఈ విధంగా సంసారం మిథ్య, అనిత్యమే!"

అలాగని ఇల్లూ వాకిలీ, భార్యాబిడ్డల్ని వదిలివేయమని శంకరాచార్యులు, శ్రీరామకృష్ణుల ఉద్దేశం కాదు. వాటికీ, వారికీ, నీకూ మధ్య ఉన్న బంధాన్ని బలమైనదిగా భావించుకోవద్దని హితవు పలుకుతున్నారు. ఎంత అప్రమత్తంగా ఉన్నా అనుబంధాలు, ఆత్మీయతలనే విచిత్ర 'వల'యాలు మనల్ని మోహంలోనే ముంచెత్తుతాయి. శాశ్వతమని భ్రమింపజేస్తాయి. అందుకే వివేక, వైరాగ్యాలను పెంచుకునే ప్రయత్నం చేయాలి. మన జీవితంలోనే కాకుండా ఇతరుల జీవితాల్లోని సంఘటనలను ఉదాహరణలుగా తీసుకుంటూ, సంసారబంధాలు ఎంత బలహీనమైనవో విశ్లేషించుకోవాలి. నిరంతరం ఆత్మీయుల మధ్యే ఆనందాన్ని వెతుక్కోవడం మానేసి, ఎవరికి వారు తమదంటూ, తమకంటూ ఓ కాలాన్ని కేటాయించుకొని, ఆ భగవంతుడితో మనస్సును అనుసంధానం చేసుకొని, గోవిందుణ్ణి భజించుకోమంటున్నారు జగద్గురువులు శంకరాచార్యులు.

అవివేకంతోనే అష్టకష్టాలు : సంసార వ్యవహారాలు, లౌకికమైన లంపటాలు మనిషి మనస్సును నిరంతరం బాహ్య ప్రపంచంలోకి పరుగెత్తేలా





చేస్తాయి. చాలా సందర్భాల్లో వివేకాన్ని కోల్పోయేలా చేస్తాయి. ఈ రోజు సమాజంలో చాలామంది అపసవ్య మార్గంలో పడి కొట్టుకుపోవడానికి ఈ అవివేకమే కారణం. ఈ సంసారాన్ని మరింత సుసంపన్నం చేసుకోవాలని పడుతున్న తాపత్రయంలో వ్యక్తిగతమై ధర్మాధర్మ విచక్షణ కూడా కొరవడుతోంది. అందుకే ఓ మారు విదురుడు, మైత్రేయునితో సంసార రూపాన్ని ఈ విధంగా వర్ణిస్తాడు :

**.... అవివేకానుగత స్వకార్య జలవేలాకీర్ణమై మిత్ర బం**
**ధు వధూ పుత్ర జలగ్రహోగ్రయుతమై, దుర్దాంతమైనట్టి దుర్భవ పాథోధి ....**

అవును! భయంకరమైన ఈ సంసార సాగరానికి అవివేకమే జలం. స్వార్థపరత్వమే చెలియలి కట్ట. మిత్రులు, బంధువులు, భార్యాపుత్రులే జలచరాలు; ఇవి దురంతమైనవి. ఈ మాయా మోహాలు మనిషిని ఎంత నీచమైన స్థాయికి దిగజారుస్తున్నాయో నేడు సమాజంలో చూస్తూనే ఉన్నాం. తీరా జ్ఞానోదయమయ్యే సమయానికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది; ఆయువు తీరిపోతుంది. అందుకే ముందే మేల్కొని, ఎవరి కోసం తపించి తపించి తప్పులు చేస్తున్నామో, రేయింబవళ్ళు వాళ్ళ తోటిదే లోకమని జీవిస్తున్నామో, వారికీ, మనకూ అంత శాశ్వత ఋణానుబంధమేదీ లేదని తెలుసుకోవాలి. అలా కాకుంటే బతికినన్నాళ్ళూ అవివేకంతో అష్టకష్టాలు పడాల్సి వస్తుంది.

**సంసారానిది ప్రవృత్తి పయనం :** సంసారం మనల్ని నివృత్తి మార్గం నుంచి ప్రవృత్తి మార్గంలోకి తీసుకువెళుతుంది. ప్రవృత్తి అంటే బయటకు పోవడం; మన ఉత్పత్తి స్థానమన పరమాత్మ నుంచి బాహ్య ప్రపంచంలోకి, సంసారంలోకి వెళ్ళడమే ప్రవృత్తి మార్గం. నివృత్తి అంటే వెనక్కి మరలడం! అంటే సంసారం నుంచి మరలి భగవంతుని వైపు, అమృతత్వం వైపు

పయనమవడం. కానీ, బాధాకరంగా ఈ రోజు సాంసారిక జీవితంలో మనిషి క్షణం కూడా తీరిక లేకుండా ప్రవృత్తి మార్గాన్నే జీవనపథంగా ఎంచుకుంటున్నాడు. అసుర లక్షణాలైన దుర్గుణాలను పెంచి పోషించు కుంటున్నాడు. అందుకే శ్రీకృష్ణ భగవానుడు ఇలా అంటాడు :

**ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః।**

**ర శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే॥**

అంటాడు. 'ఆసురీ సంపదలోని వారు ప్రవృత్తి మార్గం, నివృత్తి మార్గం అనే రెండు మార్గాలున్నట్లే ఎరుగరు. వారి యందు పవిత్రత కానీ, మంచి నడవడి గానీ, సత్యం గానీ ఉండవ'ని స్పష్టం చేస్తాడు. ఈ విచక్షణ లేమి వల్లనే మనలో నానాటికీ అసురీ లక్షణాలు పెచ్చుమీరుతున్నాయి. మన వారు అనుకున్న వారి కోసం శక్తిని మించి ప్రయాసపడుతున్నాం; అజ్ఞానంతో అలసిపోతున్నాం. ఎవరికి వారు రోజులో ఏకాంతంగా ఒక్క క్షణం ఆలోచిస్తే, ఇంత పరుగు అవసరమా అని ప్రశ్నించుకుంటే అంత రంగమే సరైన సమాధానం చెబుతుంది. ఇలా చైతన్యంతో కూడిన జ్ఞానాన్ని పెంపొందించుకుంటే, ఈ సంసారచక్రం నుంచి బయటపడగలం. ఆధ్యాత్మిక చింతన, భగవదాలంబన మనకు చిరశాంతిని ప్రసాదిస్తాయి. అప్పుడు, యోగవాశిష్ఠంలో చెప్పినట్లు ....

**న సుఖాని చ దుఖాని న మిత్రాని న బాంధవాః।**

**న జీవితం న మరణం బంధా యజ్ఞస్య చేతసః॥**

ఆ భగవంతుడి అనుగ్రహం వల్ల జ్ఞానదృష్టి కలిగాక ఈ సుఖదుఃఖాలు కానీ, ఈ బంధుమిత్రులు కానీ, ఈ జీవన్మరణాలు కానీ ఏ మాత్రం బంధకారణాలు కావు. అలా ఇకనైనా శంకరాచార్యులు బోధించినట్లు 'భజ గోవిందం ... భజ గోవిందం' అంటూ సాగిపోదాం. సంసార సాగరం నుంచి గట్టెక్కుదాం.





# మాతృసంస్థ కబుర్లు

**ఫిబ్రవరి 18 :**

కోరి కొలిచిన వారికి కొంగు బంగారం, అందరి కోరికలను తీర్చే భోళా శంకరుడు అయిన పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు మహాశివరాత్రి. మాఘ బహుళ చతుర్దశి నాడు మహా శివరాత్రి జరుపు కుంటారు. ఈ రోజు ఎవరైతే భక్తితో శివయ్యను పూజిస్తారో-ఉపవాస, జాగరణ దీక్షలను ఆచరిస్తారో వారికి శుభాలు కలుగుతాయని, శివుని కటాక్షం వారిపై ఉంటుందని హిందువుల నమ్మకం.

సాయిధామం సేవాశ్రమంలో శివరాత్రి పర్వదినం అత్యంత భక్తిప్రపత్తులతో జరిగింది. ఆశ్రమవాసులంతా శివనామ స్మరణతో, భజనలతో ఉపవాస జాగరణలతో గడిపారు. లింగోద్భవ వేళ రాత్రి 12 గం.లకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాభిషేకం, మహామృత్యుంజయ మంత్రంతో సాగింది. అనంతరం పూజా కార్యక్రమం జరిగాయి. తరువాత శివతత్త్వాన్ని గురించి స్వామీజీ వివరించారు.

మార్చి 9వ తేదీ ఫాల్గుణ బహుళ విదియ తిథుల ప్రకారం శ్రీశ్రీశ్రీ పూజ్య స్వామి సత్యపదానంద ప్రభుజీ వారి జన్మదినం. లోకం కోసం వారి జీవితాన్ని సర్వస్వం అర్పించిన గొప్ప మహిమాన్వితులు. భౌతికంగా వారు లేక 7 వసంతాలు గడిచినా వారి శక్తి ఇంకా అగుపిస్తూనే ఉంది. వారు ఎంచుకున్న ఆశయానికి, మార్గానికి చెదలుపట్టిస్తున్న దుర్మార్గుల భరతం పడుతూనే ఉన్నారు.

మార్చి 8వ తేదీ రాత్రే జ్ఞానధామానికి పుష్పాలంకరణ ఆశ్రమవాసులు చేసారు. 9వ తేదీ ఉదయాన్నే పూజ్య గురుదేవులకు నమకం, చమకం,

రుద్రంతో క్షీర, జలాభిషేకం జరిగాయి. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు గురుదేవులకు అష్టోత్తర పూజ, నివేదన సమర్పించారు.

84 వసంతాలు నిండిన సందర్భంగా '84' ఆకృతిలో దీపాలంకరణ కార్యక్రమం జరిగింది. దీపం జ్ఞానానికి ప్రతీక. మాలో నిండి ఉన్న అంధ కారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించండి స్వామీ అని గురుదేవుల భక్తులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు దీపాలు వెలిగించి వేడుకున్నారు.

ఆశ్రమ ట్రస్టు మెంబర్‌గారు అయిన డా॥ జి.చంద్రారెడ్డిగారు గురుదేవులతో వారికి ఉన్న అనుబంధాన్ని, గురుదేవుల శక్తిని వివరించారు. గురుదేవుల శక్తి వలననే వారి ఆరోగ్యం బాగుపడిందని వారికి ఇప్పడు '80' ఏళ్లని అదంతా వారి ఆశీస్సులేనని వివరించారు.

ఆశ్రమం యొక్క మూలాలను చెప్తూ ప్రస్తుతం ఉన్న శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారి ఆశ్రమ ప్రవేశం ఎలా జరిగింది. వారు ఆశ్రమానికి చేసిన కృషిని వివరించారు.

శ్రీ సత్యపదానంద ప్రభుజీ వారి పేర అన్నదాన కార్యక్రమం, పాఠశాల విద్యార్థులకు పులిహొర, స్వీటు ప్రసాదం పెట్టడం జరిగింది.

మార్చి 11వ తేదీన శ్రీ సాయి విద్యాధామం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ సందర్భంగా - 10వ తరగతి విద్యార్థులంతా పాఠశాలతో వారికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఉపాధ్యాయుల కృషిని గుర్తు చేసుకుంటూ ఏమి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేమని కన్నీటి పర్యంతమయ్యారు.

అనంతరం రామకృష్ణ మఠం స్వామీజీ శ్రీశ్రీశ్రీ నాగేష్ మహరాజ్ వారు ఆత్మవిశ్వాసం గురించి వివరించారు. మనిషికి ముఖ్యంగా విద్యార్థి ఆలోచనా విధానం ఏ విధంగా ఉండాలో వివరించారు. అనంతరం శ్రీ సాయి





విద్యాధామం కరస్పాండెంట్‌గారు అయిన డా॥ జి.చంద్రారెడ్డిగారు విద్య యొక్క విశిష్టతను వివరించి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలీ, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులైన శ్రీమతి వి.హెచ్.జ్యోతిగారు మాట్లాడుతూ - విద్యార్థి అనే వాడికి ముఖ్యంగా శ్రద్ధ, సహనం అవసరం శ్రద్ధ లేకపోతే ఏదీ సాధించలేం అని వివరించారు.

చివరగా పూజ్య స్వామీజీ శ్రీ రామానంద ప్రభుజీ వారు ఉపన్యసించారు. ఉపాధ్యాయుల యొక్క కృషిని వివరిస్తూ- ప్రతి విద్యార్థి మనస్సును చదివి దానికి అనుగుణంగా విద్యనందించాలి. విద్యతోపాటు సామాజిక విలువలు పెంపొందించాలి. అందుకే అన్నారు మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్య దేవోభవ అని తల్లిదండ్రుల తర్వాత స్థానం గురుదేవులదే. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో గడిపినంత సమయం వారి కుటుంబ సభ్యులతో కూడా గడపరు.

ఇక - మీరు అందమైన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారు. రకరకాల స్వభావాలున్న వ్యక్తుల మధ్య జీవించాలి. మీరు వారికి ఆదర్శంగా ఉండాలంటే ఈ పాఠశాలలో మీరు నేర్చుకున్న సంస్కారాన్ని విడువకుండా ఉండాలి. మీ లక్ష్యమంతా మీరు సాధించాల్సిన దానిపైనే ఉండాలి. మీ వేషధారణ మీ స్వభావాన్ని తెలుపుతుంది. మీరు మీ జీవితంలో సాధించే ఏ విజయానికైనా పునాది పాఠశాల విద్యే.

మీ జీవితంలో మీరు ఆదర్శంగా ఎన్నుకునే వ్యక్తులు గొప్పవారై ఉండాలి. మీ ఆలోచనా గమనం సవ్యమార్గంలో ఉండాలంటే గొప్పవారి జీవిత చరిత్రలు చదవాలి ఆచరించాలి. మీకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకోండి. వీడ్కోలు పాఠశాలకు మాత్రమే పలకండి. ఇన్ని సంవత్సరాలు మీరు నేర్చుకున్న విలువలకు కాదు. మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వీడు నా పిల్లవాడు అనే సగర్వంగా చెప్పకునే స్థాయికి ఎదగండి.

మానవత్వపు మనుషులుగా జీవించండి అని ఉపన్యాసం ముగించారు.

అనంతరం స్వామీజీ వారి చేతుల మీదుగా 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు "కంపాస్"లు పెన్ను, చిన్న పుస్తకం అందించారు. విచ్చేసిన వారందరికీ పండు, స్వీటు, హాటు అందించి ఆనందింపజేసారు.

**2023, మార్చి 22 :** ఉగాది పర్వదినాన సాయిధామం ఆశ్రమంలో శ్రీసాయినాథుల వారికి ప్రభాతవేళ కాకడహారతి, 6.30 గం.లకు క్షీర, జలాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ పూజ జరిగాయి. శోభకృత్ నామ సంవత్సరంలో సాయిధామం ఆశ్రమం దినదినాభివృద్ధి చెందాలనీ, ప్రజలందరూ శోభాయమానంగా వర్థిల్లాలనీ, ఎలాంటి కష్ట నష్టాలను ఎదుర్కొనరాదనీ పూజ్య స్వామీజీ శ్రీరామానంద ప్రభుజీ వారు సామూహిక చరిత్ర పారాయణ చేయాలని సంకల్పించారు. అందువల్ల ఆశ్రమవాసు లంతా జ్ఞానధామంలో గురుదేవులకు అష్టోత్తర పూజ గావించి, ఉగాది పచ్చడి నివేదన అయిన తర్వాత సామూహికంగా సాయి సచ్చరిత్ర పారాయణ విజయవంతంగా పూర్తి చేసారు.

సాయిధామాన్ని పట్టి పీడిస్తున్న నరరూప రాక్షసుల ఆకృత్యాలు అంతం చేసి, నిత్య కళ్యాణం, పచ్చతోరణంగా ఆశ్రమం వెలుగొందాలని అందరూ భగవంతుడిని ప్రార్థించారు.

సాయంత్రం 7 గం.లకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పంచాంగ శ్రవణం చేశారు.

మార్చి 27న సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఫణిదం సొసైటీ ప్రక్కన గల శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం సత్తెనపల్లి శాఖలో "శ్రీ కోదండ రామ సాయి ఆలయ" ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో జరగబోవు "రాతి ధ్వజస్తంభ ప్రతిష్ఠ" నిమిత్తం, ధ్వజ స్తంభం తయారుచేసిన మాచవరం మండలం, జింకలపాలెం తరలివెళ్ళి, పూజా కార్యక్రమాలు చేసి 41 అడుగుల రాతి





ధ్వజస్తంభాన్ని శోభాయాత్రతో, భజనలతో సత్తెనపల్లి ఆశ్రమానికి తరలించారు.

ఆలయ ధ్వజస్తంభం తయారుచేయించి, సమర్పించినవారు - స్థానిక శత్రాజుపల్లె నిమ్మయ్యగారి కుమారుడు మాణిక్యాలరావుగారు. వారి కుటుంబానికి ఆ పరమాత్ముని సంపూర్ణ ఆశీస్సులు లభించాలని సాయివాణి మనసారా ప్రార్థిస్తుంది.

ఏప్రిల్ 2వ తేది మర్యాల గ్రామంలోని శ్రీ కాటం ఐలేష్‌కుమార్‌గారి శ్రీ లక్ష్మీ నరసింహ కిరాణా అండ్ జనరల్ స్టోర్స్ షాపు పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారి కరకమలములచే ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగినది.

ఏప్రిల్ 6వ తేదీ హనుమాన్ జన్మదినోత్సవ సందర్భంగా వీర హనుమాన్ శోభాయాత్రలలో సాయిధామం సేవాశ్రమం పరిసర గ్రామాలైన అంకిరెడ్డి పల్లి, నాగినేని పల్లి గ్రామాల భక్తుల ఆహ్వానం మేరకు శ్రీ రామానంద ప్రభుజీ వారు ఈ కార్యక్రమంలో ప్రస్తుత కాలపరిస్థితులపై యువత అవలంబించవలసిన విషయాలపై ప్రసంగించడం జరిగింది.

ఏప్రిల్ 7వ తేదీన ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి పర్యవేక్షణలో రాష్ట్రీయ, స్వయం సేవక సంఘం తెలంగాణా వారి ఆధ్వర్యంలో 7వ తేదీ ఉదయం 10 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు గో ఉత్పత్తుల విశ్లేషణ, ఔషధ మరియు గో ఆధారిత వస్తువుల విశ్లేషణ మరియు శిక్షణ కార్యక్రమం ఆశ్రమంలో జరిగినది. దీనికి పరిసర గ్రామ ప్రజలు, సాయి విద్యాధామం ఉపాధ్యాయులు, భక్తులు పాల్గొని శిక్షణ పొందారు.

ఏప్రిల్ 20వ తేదీ చైత్రమాస అమావాస్య సందర్భంగా సాయిధామం ఆశ్రమంలో గురుదేవుల ఆధ్వర్యంలో గోపూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

# శ్రీ సాయినాథ అష్టోత్తర శత నామావళి

## సవ్యాఖ్యానం

శ్రీ సాయినాథుని నూట ఎనిమిది పేర్లతో అర్చించటం సాంప్రదాయం. అసలు మన పూజా విధానంలోనే సహస్ర నామార్చనకూ, అష్టోత్తర శత నామార్చనకూ ఒక విశిష్టత ఉంది. అందునా సాయినాథుని అర్చించే నామాలన్నీ సార్థకాలై, వారి జీవితాన్నీ, బోధలనూ ప్రతిబింబిస్తున్నట్లుంటాయి. హేమాడ్పంతు సాయిచరిత్ర వ్రాయాలని సంకల్పించుకున్నప్పడు బాబా "నా కథలు నేనే వ్రాసుకుంటాను. వాడు నిమిత్తమాత్రుడుగా ఉంటాడంతే" అన్నారు. అలాగే యిప్పడు స్వామివారి నామ వైశిష్ట్యాన్ని గూర్చి కొంత వివరించాలన్న సంకల్పం కలుగుతుండగా-కలిగిస్తున్న శ్రీ సాయినాథులే నా లేఖిని ద్వారా ఆ పనిచేస్తారని భావిస్తూ-అంజలిస్తున్నా.

**1. ఓం శ్రీ సాయినాథాయ నమః**

ఓంకారం ప్రణవం. శబ్దాలన్నింటికీ ఆది ఆదినాదం. శ్రీకరం, శుభకరం, శ్రేయస్కరం. అందుచేత ఓంకారం ప్రతి నామానికీ తొలుత రావలసి ఉంది. "సాయి" అంటే సాధువు అని అర్థం. సాయిబాబా చాంద్‌పాటిల్ బంధువుల పెండ్లికి షిరిడీ గడ్డ మీద కాలు మోపగానే ఎదురైన మహా భాగ్యశాలి మహల్సాపతి. అతను "ఆవో సాయీ" అని ఎంత మధురంగా, ఎంత ఆప్తతతో పిలిచాడోగానీ, అది అప్రయత్నంగా వచ్చిన ఋషి వాక్కులాగా విశ్వవ్యాప్తమైపోయింది. నాటి నుంచీ పరమాత్ముడు 'సాయి' అయినాడు.

విఖ్యాత యోగి మెహర్‌బాబా ఒకచోట సాయిబాబా గురించి ఇలా అన్నారు : "ప్రపంచాన్ని పాలిస్తున్న యోగులు మొత్తం 52 మంది ఉన్నారు. వారిలో అత్యుత్తమ స్థానంతో ఉన్న పర్యవేక్షకులు ఐదుగురు. ఈ ఐదుగురిలోనూ సర్వోత్తమ యోగి చక్రవర్తి శ్రీ సాయిబాబా. అంటే సాయిబాబా సాధువులకు నాథుడు, ప్రభువు అన్నమాట. అందుచేతనే





ఆయనను "సాయినాథాయ నమః" అని అర్చిస్తాం.

**2. ఓం శ్రీ లక్ష్మీ నారాయణాయ నమః**

'లక్ష్మి' అనే పదానికి "సర్వమూ చూడగలది" అని అర్థం. అంటే సకల జగతికీ పైన నిలచి ఆమె పరిశీలించగలదని భావం. లక్ష్మియొక్క రూపాలన్నిటిలోనూ కడపటిదీ, అత్యుత్తమమైనదీ-మోక్షలక్ష్మీ రూపం. ఇది చిన్మయమైనదీ, ఆనందమయమైనదీను.

ఇక నారాయణ నామానికి అనేక వ్యుత్పత్తులున్నాయి. నరరూపంలో అవతరిస్తూ ఉండేవాడు, నరుల సమూహానికి స్థానమైనవాడు, శబ్దగమ్యుడు, జలము స్థానంగా గలవాడు-ఇలా ఎన్నో అర్థాలున్నాయి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం పరమాత్ముడు నర రూపాన్ని ధరిస్తూ ఉంటాడు. శ్రీ సాయినాథుడు కూడా నరరూపంలోనే మనని ఉద్ధరించ వచ్చారు గదా! ఆయన నరలోకమంతటికీ ప్రభువే. కాగా-శబ్ద గమ్యుడవటం ఏమిటో చూద్దాం, శబ్దం, నాదం, నాదబ్రహ్మ అంటారు. నాదమే బ్రహ్మ. త్యాగరాజాదులు నాదోపాసనతోనే ముక్తులైనారు. శబ్దం అంటే మంత్ర శబ్దం, కీర్తనం, స్తోత్రం, ఏదైనా సరే మనను పరమాత్మునికి చేరువ చేస్తుంది. లోతుకు పోయే కొద్దీ శబ్దగమ్యుడనే దానికి వేలాది అర్థాలు గోచరిస్తాయి. కానీ, సాయికి సంబంధించినంతవరకూ చూస్తే-సాయి నామ సులభుడు. కేవలం సాయీ, సాయీ అన్నంత మాత్రాన తన అంక పీఠికి చేర్చుకుంటానన్నాడు. ఆయన అటువంటి నారాయణుడు సాయి. మరి లక్ష్మీ నారాయణులను కలిపి చెప్పటం దేనికి? మోక్షాన్ని ప్రసాదించ గల ప్రభువెవ్వరు? నారాయణుడే. ఆయన లక్ష్మీపతి. అంటే లౌకిక, పార లౌకిక ఐశ్వర్యాలు (ధనం, మోక్షం) రెండింటిపైనా అధికారం ఆయనదే. అందుచేత లక్ష్మినారాయణునితో జతపడి ఉండవలసిందే. సమస్త నర జాతికీ అటువంటి మోక్షప్రదాత-జగత్పతి గనుక సాయి లక్ష్మీనారాయణుడు. పైగా సాయి ఒక భక్తుని కోసం తాను నారాయణునిగా దర్శనమిచ్చినట్లు ఆధారం కూడా ఉంది.



# ఎవరికి ఉపదేశం చెయ్యాలి

- గౌతమ బుద్ధుడు

ఒకసారి అతడు మగధ దేశంలో పర్యటిస్తూ అళవి అను కుగ్రామం చేరాడు. ఆ మారుమూల గ్రామస్తులెంతో ఆనందపడ్డారు. సంభ్రమంలో మునిగిపోయారు. మహా మహా చక్రవర్తులే గౌతమబుద్ధుడి ముందు చేతులు కట్టుకుని నిలబడతారని వారికి తెలుసు. అలాంటిది అంత గొప్ప వాడు వాళ్ల ఊరికి దయచేయడంతో వారి ఆనందానికి హద్దులు లేవు.

ఆనాడు సాయంకాలం బుద్ధ భగవానుని ప్రవచనం మొదలయ్యే సమయానికి ఒక రైతు బిడ్డ ఆదరా బాదరాగా వచ్చి కూర్చున్నాడు. అతడు బాగా అలసిపోయి ఉన్నాడు. ఎంతో ఆకలి దహిస్తున్నా, బుద్ధ భగవానుని ఉపదేశం వినడానికి పరిగెత్తుకుంటూ వచ్చి కూర్చున్నాడు. అతడు ప్రొద్దుటి నుండి యేమీ తినలేదు. తప్పిపోయిన ఎద్దుని వెతకడానకి వెళ్లి, ఎట్లాగైతేనేం దాన్ని పట్టుకుని ఊళ్లోకి రాగానే గౌతమబుద్ధుని రాక సంగతి తెలిసి ముఖం కూడా కడుక్కోకుండా గబగబా ఇంటికి చేరి ఎద్దుని కట్టేసి సమావేశస్థలానికి పరుగు పరుగున చేరాడు.

గౌతమ బుద్ధుడు డస్సి ఉన్న ఆ రైతు బిడ్డను చూచారు. ఆ రైతు బిడ్డలో జ్ఞానం పట్ల ఎంతో మమకారం, ఉత్సాహం కనబడ్డాయతడికి. అతడికి ధర్మదీక్ష నిస్తే త్వరలోనే అతడు అర్హుడు కాగలడనిపించిందతడికి. వెంటనే గ్రామ పెద్దను పిలిపించి, ఆ రైతు బిడ్డకు మొదట కడుపునిండా అన్నం పెట్టించి తీసుకురమ్మనమనీ, వారు వచ్చేవరకూ ప్రవచనం మొదలు పెట్టననీ చెప్పారు. ఆ గ్రామపెద్ద గౌతమ బుద్ధుని ఆదేశాన్ని గొప్ప అనుగ్రహంగా తీసుకొని, ఆ రైతుబిడ్డని అప్పటికప్పడు ఇంటికి తీసుకువెళ్లి





కడుపునిండా భోజనం పెట్టించి, సమావేశస్థలానికి తీసుకువచ్చాడు.

గౌతమబుద్ధుని ప్రవచనాలను ఆ గ్రామ ప్రజలు ఎంతో శ్రద్ధగా విన్నారు. ఆ రైతుబిడ్డ మరింత శ్రద్ధగా విన్నాడు. బుద్ధుడు ఊహించినట్లుగానే కొద్ది కాలంలోనే బౌద్ధ భిక్షువయ్యాడు.

అతడికి అలా శ్రద్ధగా ఆహారం పెట్టించడానికి కారణం అడిగిన మిగిలిన శిష్యులకు గౌతమ బుద్ధుడు-ఆకలి బాధ దారుణమయినది. ఆకలి బాధతో ఉన్న వాడికి వినోద ప్రసంగం అయితే కాస్త మరపించగలదు. కానీ, మనం చెప్పేది వినోద ప్రసంగం కాదు కదా! జ్ఞానబోధ. ఆకలి అనేది మనిషికి మొండి రోగం లాంటిది. అన్నమనే ఔషధాన్ని అతడు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. జ్ఞానాన్ని పొందడానికి ఆకలి అడ్డు రాకూడదు అని చెప్పారు.

ఈ విధంగా అతడు ఆకలి తీర్చుకోవడాన్ని జ్ఞానాన్ని పొందడం కన్నా మొదటిదిగా, ముఖ్యమైనదిగా భావించారు. మరియెంతో మంది పేదవారు ఉన్నారు. వారందరూ జ్ఞాన సంపన్నులు కావాలంటే వారికి ఆకలి దప్పులు, బాధలు ఉండకూడదు. ఎంత కొద్దిగా అయినా సరే వారి ఆకలి దప్పులను పోగొట్టే మార్గమేది?

బహుశః యీ సంఘటన, ఇటువంటి సంఘటనల వలననే విద్య గరిపేందుకు నిరాడంబరమైన ఆశ్రమాలు, ఆరామాలు, వసతి గృహాలు కట్టించడానికి గౌతమ బుద్ధుడు అనుమతించాడు. అటువంటి ఆశ్రమాలు విద్యాలయాలై అతి త్వరలోనే ప్రజలు - జ్ఞాన బోధ పొందడంలో, కొందరు అర్హులు కావడంలో మంచి సత్ఫలితాలనిచ్చాయి. దానితో యిలా ఆరామాలు, విద్యాలయాలు కట్టించడాన్ని ఎంతో అభినందించారు, ప్రోత్సహించారు.

# PRAYER AND ITS EFFICACY

**- N.N. RAJAN**

Men do not think of God on account of various distractions. We can never succeed in our attempts to live a happy life if we are unaware of the existence of a higher power. So there is a real necessity for invoking the aid of God in all our undertakings. However firmly we may be bound to the world, we should think of God in all our doings and remember Him always, Success or failure in our undertakings lies in the hands of God.

It should be our aim to love God and realise Him. Faith and sincere yearning are the essential factors for winning God's grace. Faith can move mountains. By constant remembrance of God we stand to gain in many ways and by not doing so we definitely lose. He who practises religion for the sake of show or for the sake of success in his worldly life is either hypocritical or selfish.

Even those who profess no beliefs in God utter sometimes the name of God while in distress. They foolishly blow their own trumpets whenever they achieve something, thinking that they were responsible for the success. Only when laid flat by failure, do they remember God.

We can do our different duties fixing our mind on God all the time. If possible, a specific time should be set apart for prayer every day, however short it be. We can also chant His name and glory as





frequently as possible. If we have sincerity and longing for God, He will surely extend His help. By cultivating intense love for God through more and more prayer, we reach a stage where we can definitely realise God.

Prayer will not have the desired effect if it is only a mechanical repetition of God's name. During prayer our concentration should be only on God. Prayer is the only means for bringing about peace of mind and contentment. Men of prayer will, by steady practice, be at peace with themselves and with the world around them and will feel an intense and lasting joy as they advance further.

Erring mortals often make petitionary prayer besides imposing conditions upon God. One man says that he will break coconuts to God if he succeeds in his enterprise. Another man vows that he will visit the temple if his promotion takes place before it is due. A third man prays for some other material gain. The best form of prayer, however, is unconditional surrender. Prayer should contain only praise of God and His supreme powers. It should be spontaneous and pour out from the innermost recesses of our hearts and not from the lips. We often find ardent souls praying to God with devotional songs, tears rolling down their cheeks in ecstasy.

We do not know always what is good for us. God knows better. He is omniscient. Prayer for special boons may be necessary only if He is unaware of our needs. The Tamil Saint sings, "Lord, You know what is good for me".

**(will be contd... next month)**